# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ:  19-08-2026                                         సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఒక జాతీయ రహదారి ప్రాజెక్టుతో పాటూ.. నాలుగు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

- ❖ నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజ్ నేపథ్యంలో పరీక్షల సంస్కరణలపై రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులను అమలు చేయడంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం నుండి సమాధానం కోరింది.

- ❖ కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశం తమిళనాడులోని మహాబలిపురంలో రేపు జరగనుంది.

- ❖ శ్రీలంకతో జరిగిన తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్ లో భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఒక జాతీయ రహదారి ప్రాజెక్టుతో పాటూ నాలుగు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది. ఆ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులకు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం 13 వేల 41 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. నాలుగు రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 8 జిల్లాల మీదుగా సాగుతాయని తెలిపారు. వీటిలో ఖరగ్‌పూర్–భద్రక్ నాలుగో లైన్, భద్రక్–హరిదాస్‌పూర్ నాలుగో లైన్, గుమ్మిడిపూండి–గూడూరు మూడు నాలుగో లైన్లు, కటక్–పారాదీప్ మూడు నాలుగో లైన్లు ఉన్నాయని చెప్పారు. మొత్తం 9 వేల 450 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులను 2030–31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అశ్వినీ వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

అదేవిధంగా, బీహార్‌లోని ముజఫర్‌పూర్–సీతామఢి–సోన్‌బర్సా జాతీయ రహదారి-22 మార్గాన్ని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =

సురక్షితమైన మౌలిక వసతులు, ప్రత్యేక పరీక్షా కేంద్రాలు, సైబర్ భద్రతా వ్యవస్థలతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. భవిష్యత్‌లో ప్రశ్నాపత్రాల లీకేజీలను నిరోధించేందుకు ఈ చర్యలు అవసరమని పేర్కొంది. నీట్-యూజీ-2026 ప్రశ్నాపత్రం లీకేజీకి సంబంధించిన పిటిషన్లపై ఈరోజు చేపట్టిన విచారణ సందర్భంగా, రాధాకృష్ణన్ కమిటీ సిఫారసులను నందన్ నీలేకణి కమిటీ సూచనలకు అనుగుణంగా అమలు చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ.. అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర విద్యా శాఖ కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పని చేయగల పటిష్టమైన పరీక్షా సంస్థను దేశంలో ఏర్పాటు చేయడమే తమ ఉద్దేశమని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రశ్నా పత్రాలను భద్రపరిచే ప్రక్రియ కోసం శాశ్వత కమిటీ ఏర్పాటు, సీనియర్ అధికారుల నియామకం, సంస్థాగత నైపుణ్యాన్ని పెంపొందించడం వంటి సిఫారసుల అమలుపై కూడా సుప్రీంకోర్టు ప్రత్యేకంగా వివరాలు కోరింది.

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం మంత్రి అమిత్ షా రేపు తమిళనాడులోని మహాబలిపురంలో జరిగే దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళం, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతాలు ఈ మండలిలో సభ్యులుగా ఉన్నాయి. ఈ సమావేశానికి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన లెఫ్టినెంట్ గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు సీనియర్ మంత్రులు కూడా సమావేశంలో పాల్గొంటారు. ప్రాంతీయ మండలి ప్రధాన కార్యదర్శుల స్థాయిలో ఒక స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. సహకార సమాఖ్య విధానం ఆధారంగా దేశం కోసం 'టీమ్ భారత్'ను నిర్మించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ప్రాంతీయ మండళ్లు కీలకంగా పని చేస్తున్నాయని పేర్కొంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్ అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్-2026లో భాగంగా కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన యువజన వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో బ్రిక్స్ యువజన సదస్సు, బ్రిక్స్ యువజన మండలి సమావేశాలు ఈరోజు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధికి యువశక్తిని ప్రధాన చోదకశక్తిగా ముందుకు తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నారు. ఈ చర్చలు ఆగస్టు 22న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగే బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశంతో ముగియనున్నాయి. బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాలకు చెందిన అధికారిక ప్రతినిధులు, యువ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, సామాజిక మార్పుకు కృషి చేస్తున్న యువత ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత ఆర్థిక వృద్ధిని ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని, ప్రస్తుతం 6 నుంచి 8 శాతం వృద్ధి రేటుతో దేశం ముందుకు సాగుతోందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `ఉత్తరప్రదేశ్–జపాన్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్–2026`లో ప్రసంగించిన అశ్వినీ వైష్ణవ్.. దేశ అభివృద్ధి ప్రస్థానంలో పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో ప్రస్తుతం 99.6 శాతం విద్యుదీకరణ

పూర్తయిందని కేంద్రమంత్రి వెల్లడించారు. గత దశాబ్దంలో సుమారు 38 వేల కిలోమీటర్ల మేర కొత్త రైల్వే మార్గాలు జోడించడంతో పాటు.. 162 సెమీ హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రహదారి నెట్‌వర్క్‌ను కలిగి ఉందని తెలిపారు. సామాజిక, డిజిటల్, భౌతిక మౌలిక వసతుల్లో పెట్టుబడులు, సమ్మిళిత వృద్ధి, తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి అనే నాలుగు కీలక స్తంభాల ఆధారంగా భారత వృద్ధి ప్రస్థానం కొనసాగుతోందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంకతో జరిగిన తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్ లో భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. గాలే స్టేడియం వేదికగా ఈరోజు ముగిసిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకను భారత్ ఓడించి సిరీస్‌లో 1–0 ఆధిక్యం సాధించింది. 372 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, 77.4 ఓవర్లలో 206 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్ సునాయాస విజయాన్ని నమోదు చేసింది. భారత్ తరఫున మానవ్ సుతార్ 6 వికెట్లు పడగొట్టగా, ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు తీశారు. రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్ చెరో వికెట్ సాధించారు. శ్రీలంక తరఫున కెప్టెన్ ధనంజయ డి సిల్వా 151 బంతుల్లో 59 పరుగులతో పోరాట పటిమ కనబరిచారు. తొలి ఇన్నింగ్స్ లో 167, రెండో ఇన్నింగ్స్ లో 44 పరుగులు చేసి రాణించిన భారత్ బ్యాట్స్‌మెన్ దేవదత్ పడిక్కల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు.

= = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2026లో భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల-తనిషా క్రాస్టో ప్రీ-క్వార్టర్‌ఫైనల్స్ కు చేరుకుంది. రౌండ్ ఆఫ్ 32లో ధ్రువ్ కపిల-తనిషా క్రాస్టో జోడీ మకావుకు చెందిన లియాంగ్ ఐక్ చోంగ్-ఎన్గ్ వెంగ్ చి జోడీని వరుస గేముల్లో 21–11, 21–11 తేడాతో ఓడించింది. దీంతో భారత జోడీ టోర్నమెంట్‌లో తదుపరి రౌండ్‌కు ప్రవేశించింది. ఇక మహిళల సింగిల్స్‌లో పీ.వీ. సింధు రౌండ్ ఆఫ్ 32లో ఘన విజయం సాధించారు. కెనడాకు చెందిన వెన్ యూ ఝాంగ్పై సింధు 21-16, 21-17 తేడాతో వరుస గేముల్లో విజయం సాధించి ప్రీ-క్వార్టర్‌ఫైనల్స్ కు చేరుకున్నారు. మరోవైపు, భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి కూడా ప్రీ-క్వార్టర్‌ఫైనల్స్ కు చేరుకుంది. స్కాట్లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ డన్-ఆడమ్ ప్రింగిల్ జోడీ మ్యాచ్ నుంచి వైదొలగడంతో భారత జోడీకి వాక్‌ఓవర్ లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =